క్లుప్తంగా

నేడు ముచ్చర్లకు మంత్రి రాక

కందుకూరు: మండల పరిధిలోని ముచ్చర్లలో అభివృద్ధి పనులతో పాటు ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల సర్టిఫికెట్లు పంపిణీ చేయడానికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి మంగళవారం సాయంత్రం 3 గంటలకు రానున్నట్లు తహసీల్దార్ మహేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కాగలరని తహసీల్దార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పసుమాముల, తారామతిపేట, కొహెడ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు పూలే జయంతి ఉత్సవాలు

కందుకూరు: మహాత్మా జోతిరావుపూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని పూలే జయంతి ఉత్సవాల ఆహ్వాన కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ కందూరి యుగంధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశంలో మెజార్టీగా ఉన్న అణగారిన వర్గాల సంక్షేమం, ఉన్నతి కోసం 150 సంవత్సరాల క్రితమే ఉద్యమించిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించనున్న జయంతి ఉత్సవాలకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ముగిసిన సర్దార్‌నగర్ ఎస్‌పీఎల్

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో నిర్వహించిన సర్దార్‌నగర్ ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) సీజన్–06 క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిసాయి. విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.11 వేల నగదును బసునగారి సుమన్, రెండవ బహుమతి రూ.5 వేలను పండల నరేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుమన్, నర్సింగ్‌గౌడ్, శివ, శేఖర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుపై ఐదు శాతం తగ్గింపు

మీర్‌పేట: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణ ప్రజలు ఆస్తిపన్ను మొత్తం చెల్లింపులో 5 శాతం తగ్గింపు పొందవచ్చని మీర్‌పేట కార్పొరేషన్ రెవెన్యూ అధికారి అంజన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

సర్పంచ్ మద్ది సురేఖ

మహేశ్వరం: ఆయుర్వేద మందులతో ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చని మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ సర్పంచ్ మద్ది సురేఖ కరుణాకర్‌రెడ్డి అన్నారు. సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేద మందులు అన్ని మందుల కన్నా ఎంతో మేలని, మందులు వాడితే ఎలాంటి దుష్ఫలితాలు ఉండవని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, నెలలో ఒకసారి శిబిరాలు నిర్వహించాలని ఆమె సూచించారు. శిబిరంలో సుమారు 300 మంది పాల్గొని బీపీ, షుగర్, కీళ్ల నొప్పులతో పాటు ఇతర వైద్య పరీక్షలు చేయించుకోగా ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సరు. నవేద హెర్బల్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సర్పంచ్ శ్రీహరి, పంచాయితీ కార్యదర్శి నరేందర్, రైతుసంఘం అధ్యక్షులు ఎండి.మహబూబ్ పాల్గొన్నారు.

రేపు ఈజీఎస్ పనులపై సమీక్ష

కడ్తాల్: మాడ్గుల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10:30 నిమిషాలకు 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రాఘవులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, సభ్యులు అందరూ సకాలంలో హాజరుకావల్సిందిగా ఎంపీడీఓ కోరారు.

‘విజిలెన్స్’ నియామకం ఎప్పుడో!

- రేషన్ సరుకులపై కొరవడిన పర్యవేక్షణ
- హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం సరుకుల సరఫరా
- మండలంలో మొత్తం 47 రేషన్ దుకాణాలు, 17,796 కార్డులు



మహేశ్వరంలో లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

మహేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం పంపిణీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన పర్యవేక్షణ(విజిలెన్స్) కమిటీలు నామమాత్రమయ్యాయి. పర్యవేక్షణకు డివిజన్, మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై బియ్యం నాణ్యత పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో అందిస్తున్న పోషకాహారం తదితర అంశాలపై చర్చించాలి. పంపిణీ, అందించడంలో లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. డివిజన్, మండల స్థాయిలో కమిటీలు ఇంకా ఏర్పాటు చేయలేదు. పర్యవేక్షణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిన ఆహార సలహా సంఘాలను తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దుచేసి విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. డివిజన్, మండల స్థాయిలో ఇప్పటివరకు కమిటీలను ఏర్పాటు చేసిన దాఖలాలులేవు. అధికారులు కమిటీల నియమించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కమిటీలు ఇలా..

జిల్లా స్థాయి కమిటీలకు కలెక్టర్, డివిజన్ స్థాయి కమిటీకి ఆర్డీఓ, మండల స్థాయి కమిటీకి తహసీల్దార్ చైర్మన్లుగా ఉంటారు.మండల స్థాయిలో ఎంపీపీ సహా చైర్మన్‌గా ఉంటారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు ముగ్గురు మహిళా ప్రతినిధులు,ఎంపీడీఓ, వ్యవసాయాధికారి, ఇద్దరు జర్నలిస్టులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు రైతులు, రేషన్ డీలర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.

సరుకుల నాణ్యతపై ఆరోపణలు..

కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రమాణాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలకు నాణ్యతలేని రేషన్ బియ్యం, సరుకులు సరఫరా చేస్తుండడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం గురించి పట్టించుకునేవారు లేకపోయారు. మండలంలోని కొన్నిరేషన్ దుకాణాల్లో నాసిరకం బియ్యం పంపిణీ అవుతున్నాయని లబ్ధిదారులు వ్యక్తం చేశారు.పాఠశాలలు, హస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా కొన్ని చోట్ల దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలో రేషన్ దుకాణాలు, కార్డుల వివరాలు..

- మండలంలో మొత్తం రేషన్ దుకాణాలు–47
- ఆహార భద్రత కార్డులు– 15128
- అంత్యోదయ కార్డులు– 2657
- అన్నపూర్ణ కార్డులు –11

వెంటనే విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి రేషన్ బియ్యం, సరుకులపై పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

“త్వరలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేస్తాం



మహేశ్వరం మండలంలోని మొత్తం 47 రేషన్ దుకాణాలలో 17,796 రేషన్ కార్డులు ఉన్నాయి. మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఇంకా చేయలేదు. త్వరలో మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తాం. జిల్లా కలెక్టర్ అనుమతితో కమిటీలను నియమించి సమావేశాలను నిర్వహిస్తాం.ప్రతి హాస్టల్, పాఠశాలలో నాణ్యతతో కూడిన రేషన్ బియ్యం అందించేందుకు కృషి చేస్తాం.ప్రతి రేషన్ దుకాణాలపై నిఘా పెంచి నాణ్యత బియ్యం సరఫరా చేయిస్తాం.

– ఎండి.మహమూద్ అలీ, తహసీల్దార్, మహేశ్వరం

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

కందుకూరు: మండల పరిధిలోని ధన్నారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జ యేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, డైరెక్టర్ పిట్టల పాండు, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ మంద పాపమ్మ నరసింహ తదితరుల ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సమక్షంలో ఆది వారం సాయంత్రం బీర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన పిట్టల బాల్‌రాజుముదిరాజ్, మొ లగాని పరమేష్, మొలగాని రాములు, ఎం.యాదయ్య, పిట్టల పెద్ద మల్లేష్, కె.రాఘవేందర్, నరసింహ, శ్రీనివాస్, జంగయ్యతో పాటు పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆమె సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎదిరె నగేష్, వర్ర రమేష్, పిట్టల మల్లేష్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కంబం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరు

మండలంలోని గూడూరు పరిధిలో రహదారుల అభివృద్ధికి మంత్రి సబితారెడ్డి రూ.5.28 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఆ గ్రామ నాయకులు తెలిపారు. సోమవారం గూడూరు సర్పంచ్ శ్రీలత ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని ఆమె కార్యాలయంలో కలిసి నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీశైలం రహదారి నుంచి గూడూరు వరకు రూ.1.67 కోట్లు, అక్కడి నుంచి అన్నోజిగూడ ఫార్మాసిటీ రోడ్డు వరకు రూ.3.61 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, మయూరి బాబయ్య, జి.పారిజాతం, గోల్కొండ యాదగిరి, కటికపల్లి సర్పంచ్ బి.నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామం ప్లే గ్రౌండ్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, మన్సాన్‌పల్లి గ్రామ సర్పంచ్ కంది అరుణరమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని వారు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వాలు

బీఎల్ఎఫ్ జిల్లా కమిటీ కన్వీనర్ సుజాత



డీఆర్‌ఓ హరిప్రియకు వినతిపత్రం అందజేస్తున్న సుజాత, నాయకులు

బడంగ్‌పేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆకాశానంటే ధరలు పెంచి పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రంగారెడ్డి జిల్లా కమిటీ కన్వీనర్ బొడ్రమోని సుజాత పాలకులపై మండి పడ్డారు. సోమవారం బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చినప్పటి నుంచి పేద ప్రజలను మాటలతో మైమరిపించి పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలో భాగంగా దళితులకు ఇస్తామన్న 3 ఎకరాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు కలిసి ధరలు పెంచి పేదలను మరింత పేదలుగా మారుస్తున్నారని మండిపడ్డారు. నేడు భూసర్వే పేరుతో సర్వేలు చేసి పేద ప్రజల భూములను బడా కంపెనీలకు దారాదత్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాబోఏ ఎన్నికల్లో ఈ లాంటి పార్టీలకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. పేద ప్రజల కన్నీళ్లు తుడుచేందుకు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నెల 10 నుంచి బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ఎదుట ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి, మెమోరాండాలు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తం, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి భాను ప్రసాద్, ఎంసీపీఐయూ సరూర్‌నగర్ మండల కార్యదర్శి సిహెచ్ రాజు, ఎంసీపీఐయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే మహిళలకు ప్రాధాన్యత

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి



శివసేనారెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: మహిళలకు గుర్తింపు, సముచిత స్థానం కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ మొదటి వరుసలో ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువ మహిళా పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి చేతుల మీదిగా యువ మహిళా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు తలుచుకుంటే అన్ని రంగాలల్లో రాణిస్తారని అన్నారు. ఒకప్పుడు వంటింటికి పరిమితం అయిన మహిళా అంతరిక్షంలో అడుగుపెట్టే స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. మనం పుట్టకముందే ఈ దేశాన్ని ఐరన్‌లేడీగా ఇందిరాగాంధీ పాలించారని గుర్తు చేశారు. చంద్రుడిపై కాలు మోపిన కల్పనాచావ్లా ఈ దేశానికే గర్వకారణమన్నారు. లోక్‌సభ తొలి మహిళా స్పీకర్‌గా మిరా కుమారి, అతిపిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణ, మొదటి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్, మొదటి మహిళా బ్యాంక్ చైర్మన్‌గా ఉషా ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది మహిళలు, దేశానికి, ప్రపంచానికి, స్థానికంగా ఎన్నో పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. మహిళలను గుర్తించి ఈ అవార్డు కార్యక్రమం నిర్వహించిన సంగారెడ్డి యూత్ కాంగ్రెస్ నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు జయారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, జిహెచ్ఎంసీ కార్పొరేటర్ విజయారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్ తదితరులున్నారు.

బస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేటర్ మమత



బస్సును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మమత

బడంగ్‌పేట్: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ లిక్కి మమతారెడ్డి తెలిపారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 22వ డివిజన్‌లోని శివనారాయణపురం కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన శివనారాయణపురం కాలనీ నుంచి పటాన్‌చెరువు వరకు విద్యాశాఖమంత్రి సబితారెడ్డి చొరవతో ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ లిక్కి మమతారెడ్డి విచ్చేసి బస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..శివనారాయణపురం కాలనీతో పాటు సాయిప్రభుహోమ్స్, సాయిటౌన్‌షిప్, సమత నగర్, వరలక్ష్మి నగర్ తదితర కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్యూపెన్సీ పెంచి బస్ సేవలు రద్దు కాకుండా చూడాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సహకారం అందించిన మిధాని డిపో వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు లిక్కి కృష్ణారెడ్డి, డిపో మేనేజర్ జె.ఆంజనేయులు, ఇంఛార్జి స్వామిగౌడ్, కాలనీవాసులు నరహరి, లక్ష్మణ్‌నాయక్, గంగాధర్‌రెడ్డి, నర్సింగరావు, బి.కృష్ణారెడ్డి తదితరులున్నారు.

‘చెన్నకేశవ దేవస్థానం కమిటీ ఎన్నిక చెల్లదు’

కడ్తాల్: ఆమనగల్లులో ఆదివారం నూతనంగా ఎన్నుకున్న శ్రీ చెన్నకేశవ దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక చెల్లదని కులసంఘం పెద్దలు రామలింగయ్య, నర్సింహ అన్నారు. సోమవారం ఆమనగల్లు పట్టణంలో వారు మాట్లాడుతూ.. చెన్నకేశవ దేవస్థానం అధ్యక్షులకు, కార్యదర్శులకు కూడా సమాచారం ఇవ్వకుండా కేవలం రెండు, మూడు కుటుంబాలకు చెందిన వారు మాత్రమే ఆమనగల్లు శ్రీ చెన్నకేశవ దేవస్థానం కమిటీ ఎన్నుకోవడం సరికాదన్నారు. ఆలయ కమిటీని అందరి సమక్షంలో ఎన్నుకోలేదని..ఈ కమిటీ ఎన్నిక చెల్లదని వారు అన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఎన్నిక చెల్లదని మద్దతుగా సంతకాలు సేకరించారు. రాములు, నర్సింహ, యాదగిరి, మల్లేశ్, శేఖర్, చెన్నకేశవులు, ప్రశాంత్, మల్లేశ్, తలారి మహేశ్, లండం మల్లేశ్, ప్రవీన్, శేఖర్, శంకర్, శివ, రవి, మహేశ్, పర్వాతాలు, భరత్ ఉన్నారు.

సర్వే నం-61లో పొజీషన్ ఇవ్వండి



వినతిపత్రం అందజేస్తున్న దాసరిబాబు తదితరులు

మీర్‌పేట: ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూమిలో నివాసముండేందుకు పొజీషన్ ఇప్పించాలని కోరుతూ సోమవారం మీర్‌పేట అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కార్పొరేషన్, బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దాసరి బాబు మాట్లాడుతూ.. మీర్‌పేట సర్వే నం–61లోని భూమిలో స్థానిక ఎస్సీ కుటుంబాలు కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నాయని, ఇటీవల అధికారులు ఇట్టి భూమిలో సర్వే చేస్తామని చెప్పి ఇంతవరకు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. పార్కుకు 2 ఎకరాల స్థలాన్ని కేటాయించి మిగతా భూమి ఎస్సీ కుటుంబాలకు చెందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్, ఉమేందర్, బాలరాజు, భాస్కర్, నర్సింహ్మా, గంగమ్మ, లక్ష్మమ్మ ఉన్నారు.

కంటివెలుగు శిబిరాలు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ సాబేర్ అలీ


తుర్కయంజాల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. సోమవారం తుర్కయంజాల్‌లోని 10వ వార్డులో స్థానిక కౌన్సిలర్ మేతరి అనురాధతో కలిసి ఆయన కంటి పరీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, వైద్యాధికారి నరసింహ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం 21వ వార్డులో..

ఇబ్రహీంపట్నం: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి కోరారు. ఇబ్రహీంపట్నంలోని 21వ వార్డులో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ బర్ల మంగతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేదలందరికి కంటి వైద్యం చేయించేందుకు పట్టణాల్లో, పల్లెల్లో కంటి వెలుగు పథకం కింద పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తుందన్నారు. అదేవిధంగా అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. టీఆర్ఎస్ నాయకుడు జగదీశ్వర్, కమిషనర్ యూసుఫ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: క్రీడలు దేహ ధారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాతకోటతండాలో ఐక్యతా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా దాతలు విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వరప్రసాద్‌రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి టీమ్‌కి రూ.15,000, ద్వితీయ బహుమతి టీమ్‌కి రూ.10,000 అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, నాయకులు.. జీరానాయక్, సోమలింగం, శ్రీను, గోపి, పాండు, రూప్‌సింగ్, తిరుపతి, వెంకటేశ్, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు యాదయ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

కడ్తాల్: రూ.4 కోట్లతో ఆమనగల్లు మున్సిపాలిటీలోని మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణ సముదాయ పనుల్లో గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని వెంటనే విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యతో పాటు పాలకవర్గం సభ్యులు డిమాండ్ చేశారు.ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణ సముదాయ పనులను స్థానిక కౌన్సిలర్లతో కలిసి సోమవారం మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలు గాలికొదలడంతో నిర్మాణ దశలోనే పునాదుల్లో పగుళ్లు వచ్చి కూలిపోయే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. నాణ్యతా ప్రమాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, లక్ష్మణ్, కృష్ణ, కోఆప్షన్ సభ్యులు శ్రీధర్, నాయకులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

ఎంపీపీ నిర్మల



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ నిర్మల ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ కిష్టమ్మతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 300 మంది రోగులకు దీర్ఘకాలిక, తాత్కాలిక పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ కిష్టమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, గౌడసంఘం కల్వకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ అశోక్‌గౌడ్, జగన్, రంగారెడ్డి, కుమార్, వెంకటయ్య, శేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, మధు, వెంకటేశు, మల్లేష్, లింగయ్య, రాఘవేందర్, శేఖర్, వైద్యులు పాల్గొన్నారు.

నగదు బదిలీ చేయండి

గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య



వినతిపత్రం అందజేస్తున్న గొల్లకురుమలు

తలకొండపల్లి: గొల్లకురుమల ఆర్థికాభివృద్ధి చెందటానికి రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా గొర్రెలకు బదులుగా నగదు బదలీని అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన పెంటయ్య గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల సహకార సంఘం అభివృద్ధి ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మొదటి విడత గొర్రెల పంపిణీలో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని.. పశువైద్య అధికారులు, కిందిస్థాయి అధికారులు, మధ్యవర్తులు, దళారులు లాభపడ్డారని, రెండో విడతలో ఆ విధంగా జరుగకుండా చూడాలని విన్నవించారు. ఇప్పటివరకు 4లక్షల మందికి గొర్రెల పంపిణీ పూర్తయ్యిందని ఇంకా 3,72,000 మందికి గొర్రెల పంపిణీ చేయాల్సి ఉందని అన్నారు. గొల్లకురుమలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీందర్, సహాయ కార్యదర్శి మల్లేష్, రాష్ట్ర నాయకులు కొమురయ్య, బాలక్రిష్ణ, అనిల్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.